## చిన్న కథ

# ప్రేమ పిచ్చోడు

పూరిలో ఉన్న జూనియర్ కాలేజీలో చదువు పూర్తిచేసుకుని ఇరవై కిలోమీటర్ల దూరంలో ఉన్న పట్నంలోని ప్రైవేటు డిగ్రీ కళాశాలలో చేరింది సరయు. గవర్నమెంటు కాలేజీలో సీట్లు రాని వారందరూ కో ఎడ్యుకేషన్ ఉన్న ప్రైవేటు కాలేజీ లోనే చేరుతుంటారు. కాలేజీకి హాస్టల్ కూడా ఉంది. కాలేజీ తెరిచి రెండు వారాలవుతోంది. కళాశాల అబ్బాయిలు, అమ్మాయిలతో కళకళలాడుతోంది. గలగల మాటలు నవ్వులు వినిపిస్తున్నాయి.

జూలు పరికిణీ, బుట్ట చేతుల జాకెట్టు, చెవులకి బుట్ట జుంకీలు, బంతుల జడతో నడుస్తున్న సరయును అందరూ వింతగా చూస్తున్నారు. ఆ అమ్మాయి పక్కనే నడుస్తున్న అబ్బాయి "ఉష్.. ఉష్" అన్నాడు.

సరయు తల తిప్పి అతనివైపు చూసింది.

"నిన్నే మేడమ్" అన్నాడా అబ్బాయి.

"మేడమ్. అంటే నేను లెక్చరర్నా. స్టూడెంటు, లెక్చరర్ గెటప్ తేడా కూడా తెలీదా" అంది సరయు.

"పోనీ పాపా అనేదా" అన్నాడా అబ్బాయి చిలిపిగా.

"వేళ్లు చీకుతున్న చిన్న పాపనా" అంది వెటకారంగా సరయు.

"సరే..మీ పేరేంటో చెప్పరాదా" అన్నాడు.

"సరయు"

"మంచి పేరు పెట్టుకున్నారు"

"మంచిదో చెడ్డదో... నేనెవర్ని పేరు పెట్టుకోవడానికి. పేరు పెట్టింది మా అమ్మానాన్న... ఇంతకీ మీపేరు చెప్పనేలేదు" అంది సరయు.

"మీరు అడగలేదుగా"

"సందీప్.."

రోజులు గడుస్తున్నాయి. ఇద్దరి మధ్యా చనువు పెరిగింది. త్వరలో సెలవు లు ఇవ్వబోతున్నారు. కాలేజీ వదిలాక అదే పట్టణంలో ఉంటున్న తమ పిన్ని ఇంటికి బయలుదేరింది సరయు. ఆమె వెంటే ఉన్నాడు సందీప్. ఇద్దరూ మాటలు చెప్పుకుంటూ నడుస్తున్నారు.

"ఫస్ట్ ఇయర్ పరీక్షలు అయిపోయాక సెలవుల్లో ఏం చేద్దామనుకుంటున్నారు" అడిగాడు సందీప్.

"మా మామయ్య వాళ్ల వూరికి పోవాలనుకుంటున్నాను" అంది సరయు.

"నేనూ రానా.. పోనీ మీకిష్టం లేకపోతే మానేస్తా" అన్నాడు సందీప్.

"అబ్బే అదేం లేదు. తప్పకుండా రండి" అంది సరయు.

సందీప్ దారి మధ్యలో ఉన్న సాయిబాబా గుడి వద్ద ఆగిపోయాడు. సరయు తమ పిన్ని ఇంటికి వెళ్లింది.

"ఇంత ఆలస్యమయిందేమి" అడిగింది ఆమె పిన్ని లక్ష్మి.

"స్పెషల్ క్లాసు ఉంది పిన్నీ. అది అయ్యేప్పటికి ఈ వేళ అయింది" అంది సరయు బాత్‌రూంలోకి పోతూ.

సరయు ముఖం కడుక్కుని వచ్చేప్పటికి లక్ష్మి వేడి వేడి పకోడీలు ప్లేటులో తెచ్చింది. వాటిని తిని నీళ్లు తాగి కాసేపు కబుర్లు చెప్పి లేచింది సరయు.

"అప్పుడే వెళుతున్నావేం. ఉండు" అంది సరయు.

"లేదు. పిన్నీ.. ఆలశ్యమయితే మా వార్డర్ అరుస్తారు" అని వచ్చేసింది సరయు. నడచుకుంటూ



సాయిబాబా గుడివద్దకు చేరుకుంది. అప్పటి దాకా సందీప్ అక్కడే ఎదురు చూస్తున్నాడు. ఇద్దరూ కలసి షిరిడీ సాయిబాబాను దర్శించుకున్నారు.

"చదువై పోయాక ఏం చేయాలనుకుంటున్నావు" అడిగాడు సందీప్.

"అనుకోవడానికి ఏముంది. మంచిఉద్యోగం చూసుకోవాలి..నువ్వో"

"నాకు అమెరికా పోదామని ఉంది. నువ్వూ రావా" ఆశగా అడిగాడు సందీప్.

"నేను రాను.. నాకు అమెరికా రావడం ఇష్టం ఉండదు. ఇండియాలో ఎంత దూరంలో ఉన్నా అమ్మానాన్నను చూడాలనుకుంటే వెంటనే బయలుదేరి రావచ్చు. అదే విదేశాల్లో ఉంటే వీసాలని, ఫ్లైట్ టికెట్‌లని రావడం వెంటనే కుదరదు. అందుకని నాకు ఫారిన్ అంటే ఇష్టముండదు" అంది సరయు.

సందీప్ మౌనంగా ఉండిపోయాడు.

మరో ఏడాది గడచింది.

ఓరోజు సందీప్‌ను "సరయూ నీకు ఓకే అయిందారా?" అడిగారు మిత్రులు.

"నాకేమో ఓకే అనే అనిపిస్తా ఉందిరా..నాతో చానా చనువుగా ఉంటుంది.. తనకు ఏ అవసరం వచ్చినా నన్నే సంప్రదిస్తుంది" అన్నాడు సందీప్.

"నీ ప్రేమ గురించి చెప్పావారా?" అడిగారు మిత్రులు.

"చెప్పాను.. తను మౌనంగా ఉంది తప్ప సమాధానం లేదు.."

"మౌనం అర్థాంగీకారం.. నీ ప్రేమ సక్సెస్‌లేరా" అన్నారు మిత్రులందరూ ఉత్సాహంగా.

***

మూడేళ్లు గడచిపోయాయి. ఫైనల్ ఇయర్ పరీక్షలు అయిపోయి ఫలితాలు కూడా వెలువడ్డాయి. సరయుకు డిస్టింక్షన్ వచ్చింది. సందీప్ అత్తెసరు మార్కులతో పాస్ అయ్యాడు.

"ఏం చేయాలనుకుంటున్నావు" అడిగింది అంజలి.

"ఏదైనా ఇక్కడే మంచి ఉద్యోగం చేసుకోవాలనుకుంటున్నానే" అంది సరయు.

"పెళ్లి.."అంటూ ఆర్థోక్తిగా ఆపేసింది అంజలి.

"దాదాపు నిశ్చయమై పోయింది.. మా మేనమామగారి అబ్బాయి" అంది సరయు.

"సందీప్ కత ఏం చేశావ్?"

"నేనేం చేసేది..."అంది నవ్వుతూ సరయు.

"అతడు నిన్ను ప్రేమించాడు కదా.."

"నేను ప్రేమించాలి కదా"

"అయితే ఎందుకు అతని వెంట తిరిగావు"

"ఎక్కడి తిరిగాను.."

"నీకు ఏ పని అవసరమైనా అతన్నే అడిగేదానివి"

"అవును.. నాకు అన్నదమ్ముళ్లు లేరు.. పల్లెలో అమ్మానాన్న ఉంటారు.. అందుకని ఇతని సాయం తీసుకునేదాన్ని. అంతమాత్రాన అతన్ని ప్రేమించాలని లేదు కదా" అంది సరయు.

"అతను నువ్వు ప్రేమించావనే అనుకుంటున్నాడు. చదువులో కూడా బాగా వెనకపడ్డాడు" అంది అంజలి.

"అతనో ప్రేమి పిచ్చోడు..వస్తాను." అంటూ వెళ్లిపోయింది సరయు. సరయూనే కళ్లార్పకుండా చూస్తూ ఉండిపోయింది అంజలి.

– బి. రామలక్ష్మి